

# తొందరపడి... తొందరపడి

'ద్వారక'

**ఉదయం** పదకొండున్నరకే పోస్టొచ్చే ెసింది. అటెండరు చేతిలో ఉత్తరాల కట్ట చూచి కెవ్వుమన్నాడు కేశవులు.

పరీక్షలు రాస్తున్న చిన్న తరగతి పిల్లలు అదిరిపడి సర్దుకున్నారు.

కేశవులు కేక వినగానే బిలబిలమని అధ్యాపకులంతా స్టాఫు రూములో కొచ్చేశారు. అటెండరు చేతిలోంచి ఉత్తరాల కట్ట ఒడుపుగా లాగేసుకున్నాడు కేశవులు.

వచ్చిన ఉత్తరాల్లో తనకు గూడా ఒకటి ఉన్నది, "నా కొచ్చే ెసింది బాయ్!" ఎవరెస్టునెత్తిన కాలు పెట్టినంత సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతూ చేతులు పైకెగరే ెసి అరిచేశాడు కేశవులు.

"నీకు రాక మా కొస్తుందా,బ్రదర్! వెండి చెమ్చాతో పుట్టావు నువ్వు. మాముఖాలక్కూడా ఏమైనా ఉందేమో చూడనిస్తావా లేదా?" ఉక్రోషంతో ఉత్తరాల కట్ట లాక్కోబోయాడు ఖాదర్.

"కాస్త ఓర్చుకో, బాయ్! నీకూ ఉందిలే" అంటూ ఒక కార్డు తీ ెసి ఖాదర్ చేతిలో పెట్టాడు కేశవులు.

"ఎంత సేపోయ్ వెధవ సస్పెన్సు" అంటూ ఎగబడ్డాడు గోపాలయ్య.

"అవతల పిల్లలు పరీక్ష రాస్తున్నారు. ఉన్నట్లుండి నీ కేక విని పరుగెత్తుకొచ్చేశాను. వెళ్ళిపోవాలి. నా కొచ్చిందో,లేదో చూడు" అన్నాడు కృష్ణాజీ కర్తవ్యాన్ని అవసరాని కడ్డం పెట్టుకుంటూ.

అంతగా ఎగ్జె ెసిప్ ెస్పిరిట్ లేని నిదానస్థులు నోట్లో నీళ్ళు నములుకుంటూ శుభవార్త కోసం దూరం నుంచే దరహాసాలతో ఉవ్విళ్ళూరుతున్నారు.

"మొత్తం ఎనిమిది మంది కొచ్చింది" అంటూ తన సంతోషాన్నంతటినీ ఉగ్గబట్టుకుని పేరు పేరునా పిలిచి వారి వారి కార్డులు అందించాడు కేశవులు.

అందరి ముఖాలు వెయ్యి కేండిలు బల్బుల్లా వెలిగిపోతున్నాయి. ఆ చీకటి గదికి కొత్త కాంతి వచ్చింది.

×× ×× ××

ఫిబ్రవరి మొదటి వారం నుండే స్పాట్ వేల్యుయేషనుకు సంబంధించిన చర్చలు ప్రారంభమవుతాయి స్టాఫు రూములో. గత సంవత్సరపు అనుభవాలు బాగా నెమరు వేసుకుంటారు.

ఎవరెన్ని పేపర్లు దిద్దారు? ఎవరి కెంత డబ్బొచ్చింది? ఎవరెక్కడ బస చేశారు?

అక్కడ సౌకర్యాలెలా ఉన్నాయి? మంచి భోజనం కోసం పడిన పాట్లు, ఏ హొటల్లో మంచి భోజనం దొరుకుతుంది, టిఫిను ఎక్కడ బాగుంటుంది, ఎవరెన్ని సినిమాలు చూశారు వగయిరా సమస్త విషయాలు సమగ్రంగా చర్చకొస్తాయి. వారి వారి లంగ్ పవర్ని బట్టి వారి వారి వాగ్ధోరణి ఉంటుంది.

మామూలు రోజుల్లో నిద్రముఖంతో జోగుతూ ఉండే స్టాఫు రూము ఫిబ్రవరి మొదలుకొని పదో తరగతి పరీక్షలు ప్రారంభమైందాకా సందడిగా ఉంటుంది.

అసలు స్టాఫ్ రూము కాస్త సందడిగా ఉండాలంటే ప్రభుత్వంవారు కొత్త స్కేళ్ళు మంజూరు చెయ్యాలి. కొత్త డి. ఎ.లు మంజూరు చెయ్యాలి. అప్పుడు ఎడతెరిపి లేకుండా లెక్కలు, చర్చలు. వాటి తరువాత సంచలనం కలిగించేది స్పాట్ వేల్యుయేషనేను. మిగతా సమయాల్లో అందర్లోను నిర్లిప్తత, నిరాసక్తత, నిమిత్తమాత్రత తాండవిస్తూ ఉంటాయి.


×× ×× ××

పరీక్షల ప్రారంభంతో ప్రక్క ప్రక్క ఊళ్ళకు ఇన్విజిలేషన్ పర్యుకు హాజరు కావాల్సిన అవసరం, ఆదుర్దా ఉన్నందువల్ల అందరూ అంతగా కలుసుకునే అవకాశం ఉండదు. కాశీమజిలీ కథల్లా ఈ పరీక్షలు ఒక పట్టాన అయిపోవు. పదిహేను రోజులు!

ఒక్కో రోజు పరీక్ష పూర్తయ్యేసరికి ఒక్కో కొత్త జన్మ కొనుక్కున్నట్లు ఉంటుంది. ఇప్పటి పిల్లలతో ఎలా ఉన్నా చిక్కే! స్ట్రిక్ట్‌గా ఉంటే చర్మం ఒలిచేస్తామంటారు. కాపీ కొట్టుకోనిస్తే చెవులకు పిడకలు కట్టి త్రోవల్లో యాగీ చేస్తారు! వాళ్ళు కాపీలు కొట్టుకుంటూ ఉంటే చూచీ చూడనట్లు ఉండిపోతే కుదర్దు. వాళ్ళ దగ్గరున్న చీటీలో నుంచి సరైన సమాధానాలు ఏరి చూపించాలి. 'నాకు సబ్జెక్టు తెలీదు మొర్రో' అంటే 'ఫలానా వారిని పంపించు నువ్వు పోయి' అని ఆజ్ఞాపిస్తారు. కనీసం పది మార్కులకైనా ఎ, బి, సి, డి సమాధానాలు చెప్పకపోతే చెవులు మోయిస్తారు.

ఇన్ని పనులు చేసి చచ్చి సున్నమైతే చివరకు రెమ్యూనరేషను గాని, టి. ఎ. గాని పూర్తిగా చెల్లించరు. సంవత్సరాల కొద్దీ నిలిపేసుకుంటారు. ఉసూరుమంటూ ఇల్లు చేరాలి.

స్పాట్ వేల్యుయేషను అలా కాదు. పనయిపోయిన వెంటనే ఎవరికి ఎంత రావాలో పారేస్తారు. అదే పరమానందం. శ్రమించేది ఫలితం కోసమే గదా! నిండు జేబుల్తో, నవ్వు ముఖాల్తో ఇల్లు చేరుకోవచ్చును. అందుకే స్పాట్ వేల్యుయేషనంటే అంత ఉత్సాహం. రిస్కు ఉండదు. లాసు ఉండదు. అందువల్ల పరీక్షల నిర్వహణతో అంత శ్రమ పడీ కాస్తంత విశ్రాంతి గూడా తీసుకోకుండా పెట్టె




బెడా సర్దుకొని స్పాట్ కేంపుకు పరుగులు తీస్తారు.

×× ×× ××

అక్కడ స్పాట్ వేల్యుయేషన్ జరుగుతుంటే,ఇక్కడ పదిమంది పంతుళ్ళయినా లేకుండా బడి జరుగుతూనే ఉంటుంది. విధిలేక బడిలో పని చెయ్యాల్సివచ్చినవాళ్ళు పోయినవాళ్ళ అదృష్టాన్ని తిట్టుకుంటూ ఉంటారు.

అయినా స్కూలు జరిగే రోజుల్లోనే ఓరియంటేషను కోర్సులు, జనాభా లెక్కలు, ఓటర్ల లిస్టులు,స్పాట్ వేల్యుయేషన్లు ఎందుకు ఏర్పాటుచేస్తారో తెలియదు చిన్న బుర్రలకు. ఇవన్నీ సెలవు దినాల్లో ఎందుకు ఏర్పాటు చెయ్యరు? ఆయా పనులకు ప్రత్యేకంగా చెల్లిస్తున్నారు కదా!

స్పాట్ వేల్యుయేషనంటే స్పాట్ వేల్యుయేషను మీద, ఓరియంటేషను కోర్సంటే కేవలం దానిమీద, ఓటర్ల లిస్టుంటే ఓటర్ల లిస్టుమీద దృష్టి నిలిపి అసలు స్కూలును, స్కూలు పిల్లలను గాలికి వదిలేసేలా చేస్తున్నారు పెద్దలు. ఒక్కసారి వారాల కొద్దీ అందరు టీచర్లు లేకుండా స్కూళ్ళుఎలా పని చేస్తాయని వారు భావిస్తారో మరి! అక్టోబరు స్పాట్ వేల్యుయేషను మరీ ఘోరం. స్కూళ్ళు పట్టుదలతో పనిచేసి సిలబసు పూర్తి చెయ్యాల్సిన రోజులు. అప్పుడే టీచర్లు కనీసం పదిహేను రోజులయినా లేకుండా పోవటం పిల్లలకు ఎంత నష్టమో!

విస్తరి వేసే అమ్మ విస్తరి వేస్తుంది: వడ్డించే అమ్మ వడ్డిస్తుంది. పారేసే అమ్మ పారేస్తుంది. తినాల్సిన వాళ్ళు తిన్నారా అని ఆ ముగ్గురికీ పట్టదు. తమ తమ పనులు పడివడిగా ముగించుకొని తృప్తిగా విశ్రమిస్తారు.

ఎవరి పని వారికి ముఖ్యం. కాని టీచరును మాత్రం ఆ పనితో, ఈ పనితో పాఠాలు చెప్పనివ్వటంలేదు. వారికి మాత్రం వారి పని ముఖ్యం కాదా?

అనుకున్న డబ్బు ఖర్చయితే ప్రణాళికా లక్ష్యాలు సాధించినట్లేనన్న తత్త్వం ఇంకా పెద్దలను వదలకపోగా మరింత ఎక్కువ అవుతున్నది.

పథకాలు ఎవరికోసం ఉద్దేశించబడినవో వారు మాత్రం విస్మృతిలో లీనమవుతున్నారు.

×× ×× ××

మర్నాడు పరీక్షతో బాటే చర్చలు మొదలయ్యాయి.

"మొన్న అక్టోబర్‌లో డి.ఇ.ఓ. ఎకామొడేషన్ ఏర్పాటు చెయ్యలేదట"

అన్నాడు కేశవులు. ఇలాంటి విషయాల్లో అతనికి ఉత్సాహం జాస్తి.

అందరి ముఖాలు నల్లగా మారాయి.

"ప్రతి సంవత్సరం ఇస్తున్నారుగా. ఇప్పుడెందు ఇవ్వరు?" బల్ల గుద్దాడు ఖాదర్.

"కొత్త గవర్నమెంటు చాలావాటితో పాటు దీన్నీ రద్దు చేసిందట." అందుకున్నాడు చలమయ్య.

"వాళ్ళు రద్దుచేస్తే మన వాళ్ళూరుకుంటారా?" ఉత్సాహం తెచ్చుకుంటూ కలిశాడు సుందర్రామయ్య.

" 'మీకు పూర్తి టి.ఎ., డి.ఎ. ఇస్తున్నాం గనుక మీ తంటాలు మీరు పడాల్సిందే. మేమేమైనా చెయ్యాలని మీరు కోరితే మీ డి.ఎ.లో ఫిఫ్టీ పర్సంటు కట్ పెట్టమన్నారు' అన్నాడట డి.ఇ.ఓ. మనవాళ్ళు నిగ్గదీసేసరికి జి.ఓ. బయటపెట్టి తోకముడిచి పళ్ళికిలించాడట" అన్నాడు కేశవులు.

నవ్వులు నిండాయి గదిలో.

"అన్నీ వేషాలు, జిత్తులు. ఆయన కావాలనుకుంటే ఏ స్కూల్లో ఇప్పించగూడదు?" అన్నాడు పుండరీకాక్షుడు—అ సెంబ్లి

మెంబరు కావాల్సినవాడు ఖర్మకాలి అయ్యవారయి కూచున్నాడు.

"అసలు మనమంటే ఎవరికీ గౌరవం లేదు, బ్రదర్! మన డిపార్టుమెంటుకే మనమంటే లోకువ." పరీక్ష గదిలోంచే చర్చను వింటున్న సోషలు టీచరు చక్రపాణి అన్నాడు.

"ఇంతకూ రే పక్కడ ఏం చేద్దామంటారు?" అసలు విషయాని కొచ్చాడు తెలుగు పండితుడు తిరువెంగడయ్య.

"మనం నగం డి. ఎ. వదులుకుంటే ఏదైనా స్కూల్లో మనకు బస ఏర్పాటు చేస్తారు. లేకపోతే మన ఏర్పాట్లు మనం చూచుకోవాల్సిందే" అన్నాడు కేశవులు.

"మన మేం చేద్దాం, భాయీ!" పుండరీకాక్షుడిని కదిపాడు ఖాదర్.

"ఈసారి అలా చే స్తే ఒప్పుకోము. మర్చిలో కనీసం వెయ్యి మందైనా ఎగ్జామినర్లు చేరుతారు. అందరం యాజిటేట్ చేద్దాం. 'పేపర్లు దిద్దము' అంటూ పెన్ డౌన్ సమ్మె చేద్దాం. మనకు ఫ్రీ ఎకామొడేషన్ ఎందు కేర్పాటు చెయ్యరో తేల్చేద్దాం." రణభేరి మోగించాడు పుండరీకాక్షుడు.

"సమ్మెలు, ధర్నాలు ముందు మనం తల దాచుకునేందుకు చోటు దొరికిం తరువాత గదా?" పాయింటు లాగాడు చలమయ్య.

"స్పాట్ సెంటరుకు చేరగానే ఉద్యమిద్దాం" అన్నాడు పుండరీకాక్షుడు.


"అప్పటి కందరూ ఒక్క చోటికి చేరరు. మనకు బలముండదు. ఊరికే అభానుపాలవుతాం." తన ఆలోచనను జోడించాడు తిరువెంగడయ్య.

ఆ మాట కందరూ అంగీకరించారు.

"స్పాటు ప్రారంభమైం తరువాత గదా మనం ఏమైనా చెయ్యగలిగేది! ముందుగానే ఆందోళన ప్రారంభి స్తే ఇళ్ళ కెళ్ళిపొండంటే ఏం చేస్తాం? అంతవరకు మనం ఎలాగో సర్దుకోవాలి" అన్నాడు చక్రపాణి.

ఆ విషయంగా చాలా సేపు తర్జన భర్జనలు జరిగాయి. అందరూ ఒక నిర్ణయానికొచ్చారు. ఏదైనా లాడ్జిలో తమకుగాను రెండు రూములు రిజర్వు చేయించుకోవాలని నిర్ణయించుకున్నారు. గదికి నలుగురే సి చొప్పున ఉంటూ, అద్దె నలుగురూ సమానంగా భరించాలనే అంగీకారానికి వచ్చారు. ఆ ఏర్పాట్ల భారం కేశవులు నెత్తిన పెట్టారు.

ఆ విషయం సెటిలయిం తరువాత గత సంవత్సరం తమకు ఏర్పాటు చే సిన స్కూల్లో లెట్రిన్ సరిగా లేదని, మంచినీళ్ళ ఏర్పాటు సక్రమంగా లేదని, రాత్రిళ్ళు ఏనుగంత దోమలు కుట్టి చంపాయని, హొటలుకు, స్కూలుకు చాలా దూరమని తమ చేదు అనుభవాల నన్నిటిని నెమరేసుకున్నారు. లాడ్జిలో ఊరి మధ్యలో స్పాట్ సెంటరుకు, హొటళ్ళకు, సినిమా హాళ్ళకు దగ్గరగా,




దర్జాగా ఉండవచ్చునని తీర్మానించుకున్నారు.

పరీక్షలు బ్రహ్మాండంగా జరిగిపోయాయి. విజయగర్వంతో, చెక్కుచెదరకుండా ఇన్విజిలేటర్లు ఇళ్ళకు చేరారు. ఈసారిగూడా రెమ్యూనరేషను, టి.ఎ., డి.ఎ.లు పూర్తిగా చెల్లించలేదనే కొరత లేకపోలేదు.

మర్నాడు జర్నీ డే. మూ డోరోజు స్కూల్లో విధులకు హాజరు. ఆ సాయంత్రం అక్కడి నుండి రిలీవు. మర్నాడు జర్నీ డే. ఆ పైరోజు మొదటి బస్సుకే అందరూ కలి సి స్పాట్ సెంటరుకు చేరుకున్నారు.

×× ×× ××

పెట్టెబేడాలతో నిర్ణీత సమయానికి స్పాట్ సెంటరు చేరుకున్నారు. అక్కడ ఏమాత్రం అలికిడీ లేదు. ఎవరిముందు జాయినింగు రిపోర్టు ఇవ్వాలో తెలీక కొంత సేపు సతమతమయ్యారు. మరో గంట తరువాత కేంపు ఆఫీసరుగారు జీపులో మందీమార్బలంతో స్పాట్ సెంటరు చేరారు. ఎగ్జామినర్లంతా వినయపూర్వక నమస్కారాలతో వారికి స్వాగతం పలికి తమ రాక నిమిత్తమెరిగించుకున్నారు. కొంత సేపు కేంపు ప్రారంభపు హడావుడి, కుర్చీలు వెయ్యటం, సర్దటం, మైకు, లౌడు స్పీకర్లు ఏర్పాటు చెయ్యటం వగయిరాలు. ఆ తరువాత అపాయింట్‌మెంట్ ఆర్డర్ల స్వీకరణ, వచ్చినవారి పేర్లు నమోదు చేసుకోవటం—మొదలయిన తతంగమంతా క్రమంలో జరుగుతున్నది.

ఒక్కొక్క పరీక్షకుల బృందం రాకతో ఆవరణం నిండిపోయి కోలాహలం ఎక్కువవుతున్నది. పాత మిత్రులు పలకరించుకోటాలు, యోగక్షేమాల విచారణ, తమ తమ విద్యాలయాల్లో నూతనంగా జరిగిన వింతలు, విడ్డూరాల గురించి విషయ సేకరణలు జరుగుతున్నాయి పరీక్షకుల్లో.

ఇంతలో మైకులో ప్రకటన—అందరి చెవులూ అటు తిరిగాయి. " యువరటెన్షన్ ప్లీజ్! స్పాట్ రేపు మధ్యాహ్నం పన్నెండు గంటలకు ప్రారంభమై రాత్రి ఎనిమిది గంటలవరకు నిర్విరామంగా జరుగుతుంది. జాయినింగు రిపోర్టు ఇచ్చిన వారంతా తమ తమ నెలవులకు వెళ్ళవచ్చు...తిరిగి రేపు పన్నెండు గంటలకు..." డి.ఇ.ఓ. ఆఫీసులో పలుకుబడిగల పిల్లగుమస్తా గొంతు ఖంగున మోగింది మైకులో.

పరీక్షకుల్లో సంచలనం ప్రారంభమైంది. "ఏకబిగిన ఎనిమిది గంటలు మాన సిక శ్రమ చెయ్యటం ఎవడి తరం?" అన్నది అసలు పాయింటు.

కాస్త నోరుగలవాళ్ళు, నాయకులుగా చలామణి అవుతున్నవాళ్ళు, నాయకులు కాగోరే యువకులు ఒక్కుమ్మడిగా పోయి కేంపు ఆఫీసరుగార్ని చుట్టుముట్టారు. చర్చలు జరిగాయి. "ఈ ఏర్పాటు రెండు రోజులు మాత్రమే. తరువాత ఉదయం, సాయంత్రం రెండు షిఫ్టుల్లో ఉంటుంది." రాజీ మార్గాన్ని ప్రకటించాడు పిల్లక్లర్కు.

"మా ఎకామొడేషను మాటేంటి?" ముక్త కంఠంతో అడిగా రంతా.

"స్కూళ్ళు ఖాళీగా లేవు. అన్నిచోట్లా ఇంకా క్రింది క్లాసుల పరీక్షలు జరుగుతున్నాయి. పైగా ఫిఫ్టీ పర్సంటు డి.ఎ. కట్ చెయ్యమంటూ ప్రభుత్వ ఉత్తర్వు. ఈ విషయంగా తరువాత చర్చిద్దాం. ఈలోగా మీ ఏర్పాట్లు మీరే చూచుకోండి తాత్కాలికంగా" అంటూ కేంపు ఆఫీసరుగారు మైకు ముందుకొచ్చి ప్రకటించారు.

వేడి నిట్టూర్పులు విడిచారు పరీక్షకులు.

×× ×× ××

"రిపోర్టిచ్చాం గదా! ఇక రేపు పన్నెండుకు" అన్నాడు చలమయ్య పెట్టె భుజాని కెత్తుకుంటూ.

"ఆత్మారాముడు గోల చేస్తున్నాడు. ఏమై

నా వేద్దాం పదండి." హోల్డాలు చంకలో ఇరికించుకున్నాడు తిరువెంగడయ్య.

"రూముల రిజర్వేషను మాటేందో ముందు చూడండి" అన్నాడు ఖాదర్ బయల్దేరుతూ.

"ముందు భోజనం. తరువాత మిగతావన్నీ." ముందు నడిచాడు పుండరీకాక్షుడు.

సమీపంలోని హోటల్లో భోజనాలు ముగించుకున్నారు సర్కారు మీల్సుతో.

"ఈ తిండితో పది రోజులు మాడాల్నా, బాబూ!" దిగాలు పడ్డాడు చక్రపాణి.

"ప్రభుత్వం ఎందులో వేలు పెట్టినా ఇలాగే తగలడుతున్నది." ముక్కు తుడుచుకుంటూ మూలిగాడు తిరువెంగడయ్య.

లగేజి మోసుకొని లాడ్జి చేరుకున్నారు. అక్కడ అన్ని గదులూ కిటకిట లాడుతున్నాయి. లాడ్జి గుమస్తాముందు లగేజి దింపి తమ గదుల గురించి వాకబు చేశాడు కేశవులు. ఇంజినీరు రికమెండేషన్‌తో తమపేర గదులు రిజర్వయి ఉన్నాయి. పూర్వాశ్రమంలో ఇంజినీరు కేశవులు శిష్యుడు. కేశవులు జాబు రాయగా ఏర్పాటు చేశా డతను. ఇంజినీరయినా తనపట్ల గురుభావం ఉన్నందుకు సంతోషంతో పాటు కించిత్తు గర్వం కూడా కలిగింది కేశవులుకు. గుమస్తా గూడా తమతో మర్యాదగా మట్లాడాడు.

లాడ్జి బోయ్ తాళంచేతులు తీసుకొని ముందు త్రోవ చూపుతుండగా ఎనిమిది మందీ అతని వెనకాలే రూముల్లోకి చేరారు. ఎందరికో ఆ లాడ్జిలో గదులు దొరకలేదు. తమకు మాత్రం ఉంటాయా అని అనుమానపడ్డారు.

విజయోత్సాహంతో ఇంజినీరును మెచ్చుకుంటూ రెండు గదుల్లో అందరూ సర్దుకునేశారు.

లాడ్జిలో బెడ్ల పరిశుభ్రత, గాలి, వెలుతురు, స్నానాదికాలకు ఏర్పాట్లు ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించి తృప్తిపడ్డారు.

ఆ సాయంత్రం టిఫిన్లు చేసి సినిమాకెళ్ళారందరూ- ఎక్కడ చూసినా ఒకటే రద్దీ.

× × ×

మర్నాడుదయం పదకొండు గంటలకే బయల్దేరి మార్గమధ్యంలో భోజనాలు ముగించుకొని స్పాట్ సెంటరుకు చేరారు జవాబులకు విలువలు కట్టే షరాబులు.

పేపర్ల వాల్యుయేషనుకు ఏర్పాట్లు చురుగ్గా సాగిపోతున్నాయి. నిన్నలా మందకొడిగా లేదు వ్యవహారం.

'ఫలానా పేపరు వారు ఫలానా నంబరు గదిలోకి చేరండి'అంటూ కూత వేశాడు పిల్ల గుమస్తా మైకులో.


ఆయా గదుల్లోకి చేరి బెంచీల మీది దుమ్ము దులుపుకొని సుఖాసను లయ్యా రంతా. కేంపు అసిస్టెంటు కారా కిళ్ళీ నములుతూ చంకలో ఫైళ్ళతో గదిలో కొచ్చాడు. పరీక్షకులు చిరునవ్వులు చిందిస్తూ నమస్కారాలతో అతగాడికి స్వాగతం చెప్పారు. ఛీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంటు ఎగ్జామినర్లు ఎవరి కెవరో నిర్ణయించి, వాల్యుయేషను ప్రిన్సిపుల్సు కాగితాలు పంచిపెట్టి వెళ్ళిపోయాడు.

అందరూ శ్రద్ధగా ఆ కాగితాలు చదువుకోటం మొదలుపెట్టారు.

'ఫలానా ప్రశ్న రాసేందుకు ప్రయత్నించినా ప్రయత్నించకపోయినా అయిదు మార్కులు వెయ్యండి అని ఒకచోట, 'ఇచ్చిన జవాబులన్నీ తప్పే గాబట్టి ఏది రాసినా రాయకపోయినా ఒక్క మార్కు వెయ్యండి' అని మరోచోట జాగ్రత్తగా సూత్రాలు తయారు చేశారు. 'విద్యార్థులకు ఏ పరిస్థితిలోనూ అన్యాయం జరగ గూడదు'- ఇది అందరి ఏకగ్రీవాభిప్రాయం.

మరో అరగంటలో పేపర్లు వచ్చి చేరాయి. అందరికీ సంతకాలు పూర్తి చేసి ఛీఫులు కాఫీ కేంటీనుకు దారి తీశారు అలసటతో.

పేపర్లలోని జవాబులకు విలువలు కట్టటం ప్రారంభమైంది. చొక్కాలు విప్పేసి



కొందరు చొక్కా గుండీలు మాత్రమే విప్పుకొని కొందరు, విలువలు కట్టటంలో నిమగ్నులయారు.

ఎక్కడివారో, ఎలాంటివారో వ్రాసిన జవాబులకు ఎర్రరంగు అద్దకాలు చకచకా సాగిపోయాయి. అక్కడక్కడ ఆకుపచ్చరంగు సగిపీలు.

మధ్యాహ్నం మూడు గంటలకు దిద్దిన పేపర్లు చీఫ్ల వశం చేసి పరీక్షకులు ఒకరొకరురుగా బయట పడటం ప్రారంభించారు. సాయంత్రం అయిదు గంటలకంతా కేంపు ఖాళీ అయింది. రాత్రి ఎనిమిది గంటల వరకు పని జరగాలి గాబట్టి ఈలోగా లైటింగు ఏర్పాట్లు పూర్తి చేశారు.

× ××

పని త్వరగా తెమిలినందుకు అమందానందంతో అందరూ తమ తమ గదులకు చేరుకున్నారు. జర్నీ క్రింద ఒకరోజు ఒప్పుకుంటారా, రెండు రోజుల కొప్పించాలా? బస్సు చార్జీల క్రింద ఎంత వెయ్యాలి? ఫస్టుక్లాసు ట్రెయిను ఫేరుకు ఎలిజిబిలిటీ ఉన్నా ఎందుకివ్వరు? మొదలయిన మీమాంసలతో కాలం గడిచిపోయింది. కొంత ముందుగానే హొటలుకు పోయి భోజనాలు ముగించుకొచరు.

పరీక్షకులతో కిటకిటలా డుతున్న రూములు కొద్దిగా పలచబడి ఉండటం గమనించాడు తిరువెంగడయ్య. విషయమేమిటా అని ఆరాతీశాడు. ఒక ప్రయివేటు స్కూలు హెడ్మాస్టరు తన స్కూల్లో ఉదారంగా పరీక్షకులు బసచేసేందుకు రెండు గదులు కేటాయించాడట. అప్పుడే కొంద రక్కడ చేరిపోయారు.

క్షణాల మీద ఈ వార్త లాడ్జి అంతటా వ్యాపించింది దావానలంలా. చాలా మంది ట్రంకులు, బెడ్డింగులు చంకన పెట్టుకొని బయలుదేరారు.

"మనమూ వెళ్ళిపోదాం..." హొల్డాలు సర్దటం మొదలుపెట్టాడు తిరు వెంగడయ్య.


"అదే మంచి పని. ఇక్కడ ప్రతిరోజూ డబ్బు చెల్లించొద్దా?" అంటూ జత కలిశాడు కాశీపతి.

"అయిందేదో అయింది. ఇక్కడే ఉండిపోదాం" అన్నాడు కేశవులు, వెళ్ళిపోతే శిష్యుడేమనుకుంటాడోననే బెంగతో.

"నీ కిష్టమైతే నువ్వుండు, నాయనా. నీకేం? మహరాజువి. రెండాస్తులకు వారసుడివి." అసూయపడ్డాడు చక్రపాణి.

"మొగుడూ, పెళ్ళాం- మీరిద్దరూ సంపాదించటంలా?" తిప్పి కొట్టాడు కేశవులు.

"ఎందుకయ్యా వాగ్వాదాలు? మనం కష్టపడి సంపాదించింది కాస్తా లాడ్జి వాడి ముఖాన పోసేందుకా వచ్చింది?" హొల్డాలు చంకకెత్తుకుంటూ మండిపడ్డాడు తిరువెంగడయ్య.




"నేనూ వస్తానుండు,పండిట్జీ." పెట్టె అందుకున్నాడు ఖాదర్.

"మీతోపాటే నేనూ." బయల్దేరాడు పుండరీకాక్షుడు.

"రోజుకు రెండు రూపాయలన్నా మన సౌకర్యం కోసం ఖర్చు చెయ్యలేమా మనం?" విస్తుపోయాడు కేశవులు.

"నలుగురితోపాటు నారాయణా! ఇక్కడికంటె అక్కడే బాగుంటుంది. వచ్చేవాళ్ళంతా నాతో రండి." ఎంకరేజి చేశాడు పుండరీకాక్షుడు.

రాత్రికి రాత్రే గదులు ఖాళీ అయ్యాయి. కొన్ని గదుల్లో చేరినవారు మాత్రం సాహసించి అక్కడే ఉండిపోయారు.

×× ×× ××

పది రోజుల్లో స్పాట్ ముగిసింది. నిండు జేబుల్తో అందరూ స్వస్థలాలకు చేరుకున్నారు.

×× ×× ××

"డియర్ సార్!

మీ కోసం రెండు రూములు రిజర్వు చేయించాను మీ కోరిక మేరకు. కాని మీరు అందులో రెండు రోజులు గూడా పూర్తిగా ఉండలేదని తెలిసింది. ఎక్కడో స్కూల్లో ఉచిత వసతి దొరికినందువల్ల అందరూ అక్కడే చేరిపోయారని విన్నాను.

ఇప్పుడు మీకూ మంచి జీతా లొస్తున్నాయి. ఇలాంటి ప్రత్యేక సందర్భాల్లో ప్రత్యేక ఎలవెన్సులు పొందుతున్నారు. అయినా డబ్బు ఖర్చు చెయ్యాలంటే ఎందుకో భయం మీకు! మీ సౌకర్యం కోసం మీరు నాలుగు రూపాయలు ఖర్చు చెయ్యలేరా?

మిమ్మల్ని సమాజంలో అందరూ గౌరవించడం లేదని బాధపడతారు. గౌరవించాలని కోరుతారు. నిజానికి మీరు కోరుతున్నది గౌరవం కాదు-దయను, సానుభూతిని. దయ, సానుభూతి కావాల్సింది రోగగ్రస్తులకు, వికలాంగులకు, కాలం కాటేసిన అభాగ్యులకు.

నాకో సందేహం- మిమ్మల్ని మీరు గౌరవించుకుంటున్నారా? మీ వృత్తిని మీరు గౌరవించుకుంటున్నారా?

ఎప్పుడూ పరుల దయా ధర్మాల కోసం అరాటపడే మనిషి స్వతంత్ర పౌరుల్ని, ఆత్మస్థయిర్యంగల మనుషుల్ని, స్వతంత్ర భావాలుగల పురుషుల్ని, స్త్రీలను ఎలా తయారు చెయ్యగలరు?

మీరు భావి సమాజ నిర్మాతలు. మీ రిలాగే ఉంటే మన దేశం స్వతంత్రమయ్యే దెప్పుడు?

ఇంగ్లీషు వాడు ఎవరైనా ఎదురైతే తన చెయ్యి సందిస్తాడు. 'నీకు నా సహకారం ఉంది' అని దాని అర్థం. మనం చేతులు జోడిస్తాం. అది గౌరవ సూచకమని మనం అపోహపడతాం- కాని.ఆ జోడింపులో నీకు నువ్వే, నాకు నేనే అన్న అర్థం కొట్టొచ్చినట్లు స్ఫురిస్తుంది. 'నన్ను ముట్టుకోకు నా మాలకాకి' అన్న భావం ప్రస్ఫుట మవుతుంది. అది పిరికితనానికి ప్రతీక.

పరస్పర సహకారంతో ఇంగ్లీషువాళ్ళు ప్రపంచాన్ని పరిపాలించారు. ఇన్ని సంవత్సరాలుగా మనం స్వతంత్రులమని చెప్పుకుంటున్నా స్వతంత్రానికి,మనకు ఇంకా ఎంతో దూరం ఉంది.

అడ్వాన్సు క్రింద రూములు రిజర్వేషనుకు సలభై రూపాయలు కట్టాను. దయచేసి ఆ డబ్బు వెంటనే పంపగలరు.

మీ శిష్యుడు
-గోపాలం."

తా.క:- మనియార్డరు కమీషను ఆ డబ్బులోంచే మినహాయించుకోండి.

×× ×× ××

ఉత్తరం చదివి మండిపడ్డాడు కేశవులు. సహోద్యోగుల నుండీ వారి వారి వాటా రాబట్టేందుకు ఉద్యుక్తుడయినాడు వెంటనే.

★